సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం। 23 । జనవరి । 2023



ముఖ్యమంత్రి బీసీల పక్షపాతి

బీసీ కార్పొరేషన్‌ల పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

- 8లో



కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి.

- 8లో



రసవత్తరంగా సంగిడీల పోటీలు

బాలఅన్నమ్మ పేరంటాలు జాతర పురస్కరించుకుని, మండలంలోని సురవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన సంగిడీల పోటీలు రసవత్తరంగా సాగాయి.

- 8లో

న్యూస్‌రీల్

పెదకుదమ పరిసరాల్లో గజరాజులు



పెదకుదమ చెరువు వద్ద గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పరిసర ప్రాంతాలలో ఉన్న చెరువులో ఆదివారం ఏనుగులు తిష్ట వేశాయి. ఉదయం అరటి తోటలో ఉన్న ఏనుగులు మధ్యాహ్న సమయానికి చెరువులోకి జారుకొని జలకాలాడుతున్నాయి. శనివారం రాత్రి వెంకటరాజపురం, గవరమ్మపేట వరి నారుమళ్లలో తిరిగాయని రైతులు తెలిపారు. రాత్రి బాసంగి, వెంకటరాజపురం, పెదకుదమ, చినకుదమ గ్రామాల్లోకి చొచ్చుకువచ్చే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తం చేసింది.

హెచ్‌ఎం సస్పెన్షన్

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని సంతకవిటి మండలం అప్పల అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు(స్కూల్ అసిస్టెంట్, మేథ్స్)గా పనిచేస్తున్న ఎర్రా అప్పలరాజుపై వచ్చిన లైంగిక వేధింపుల అభియోగాలపై సంతకవిటి ఎంఈఓ ప్రాథమిక నివేదిక మేరకు విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గల ఉపాధ్యాయులు ఎవరైనా విద్యార్థినిల పట్ల లైంగిక పరంగా వేధిస్తే విధుల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

24 నుంచి స్టెప్‌కాన్ సదస్సు

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీలో ఈ నెల 24, 25 తేదీల్లో 15వ స్టెప్‌కాన్ సదస్సు నిర్వహించనున్నామని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 2 వేల మంది యువ, సృజనాత్మక ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ జీవీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు లాంఛనంగా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థల నుంచి 18 మంది నిపుణులు పాల్గొని విద్యార్థులతో వారి అనుభవాలను పంచుకోనున్నారని తెలిపారు. జీఎంఆర్ సంస్థల సీఈఓ అశ్విని లోహాని మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో విద్యార్థులు వినూత్న ఆలోచనలు, సృజనాత్మక చర్యలు, సమకాలిన ఆలోచనలు విద్యార్థులలో తీసుకురావాలని ఆకాంక్షించారు. స్టెప్‌కాన్ కన్వీనర్‌గా డాక్టర్ వి.ప్రసాద్, కో కన్వీనర్‌గా డాక్టర్ టి.ఎస్.కిషోర్, స్టూడెంట్ కన్వీనర్‌గా పి.శ్రీవాత్సవ్‌లు వ్యవహరించనున్నారని తెలిపారు.

ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం

- ఏపీఎస్ఎఫ్ఎల్ ఈడీ జగన్‌మోహనరావు

విజయనగరం గంటస్తంభం: ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఏపీ ఫైబర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిల్లా జగన్‌మోహనరావు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఏపీ ఫైబర్ కేబుల్ ఆపరేటర్లతో ఆయన ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ ఫైబర్ గ్రిడ్‌ను మరింత విస్తృతం చేసి పటిష్టం చేశామని అన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికి ఫైబర్ లైన్‌లు వేశామని, అక్కడ ఆప్టికల్ లైన్ ట్రాన్సిమీటర్లను అమర్చనున్నట్టు తెలిపారు. దీని వల్ల మారుమూల గ్రామీణ ప్రాంతంలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, ఆయా గ్రామాల్లో ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్ నెలకు కనిష్టంగా రూ.190ల నుంచి వివిధ ప్యాక్‌లలో అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలో ఏపీ ఫైబర్ మాత్రమే టీవీ ఛానల్స్, ఇంటర్నెట్, టెలిఫోన్ సౌకర్యాలతో కూడిన ట్రిపుల్ ప్లే సర్వీసులను అత్యంత నాణ్యంగా అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో 80 లక్షల ఇళ్లకు సర్వీసులు అందివ్వడానికి లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇందుకు కావాల్సిన సెటాప్ బాక్స్‌లు, ఇతర పరికరాలు సంస్థ సమకూర్చుతోందన్నారు. కేబుల్ ఆపరేటర్లు సహకరించి ఏపీ ఫైబర్ సేవలను విస్తరించాలని కోరారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు నెట్‌వర్క్‌లో ఎదురవుతున్న బిల్లింగ్ సమస్యలు, సాంకేతిక సమస్యలు, నెట్‌వర్క్ విస్తరణకు కావాల్సిన పరికరాల ఆవశ్యకతను ఈడీ జగన్‌మోహనరావు దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈడీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ పిల్లా సతీష్, టెక్నికల్ మేనేజర్ షణ్ముఖ్, ఎంటర్‌ప్రైజెస్ మేనేజరు సాయి, బిల్లింగ్ మేనేజరు రాంశ్రీనివాస్, ఫైబర్ ఇన్‌చార్జి జనార్దన్, ఎంటర్‌ప్రైజెస్ చంద్రశేఖర్, రవి, రమేష్ తదితర ఏపీఎస్ఎఫ్ఎల్ జిల్లా సిబ్బందితో పాటు కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇక ఉచితం



ఎండీఎం వాహనాల ద్వారా సరుకులను అందిస్తున్న ఎండీఎం ఆపరేటర్ (ఫైల్)

- జిల్లాలో ప్రతీ నెల 5,251 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- 2.75 లక్షల కార్డుదారులకు లబ్ధి
- 196 వాహనాల ద్వారా బియ్యం పంపిణీ
- ఏడాది పాటు బియ్యం పంపిణీ కొనసాగింపు



ఫోర్టిఫైడ్ బియ్యం

పార్వతీపురం: రేషన్ బియ్యాన్ని ఇక పూర్తిగా ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతవరకు కిలోకి రూపాయి తీసుకొనే వాళ్లు. ఇక నుంచి పూర్తిగా ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే సంక్షేమ పథకాలతో భరోసాను ఇస్తున్న ప్రభుత్వం నూతన సంవత్సరం నుంచి జిల్లాలో ఉచిత రేషన్ అమలు చేయనుంది. ప్రతీ నెల 5,251 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నారు. రేషన్ కార్డుదారులకు గతంలో ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున్న రేషన్ బియ్యాన్ని అందిస్తూ కిలో ఒక రూపాయికే ప్రభుత్వం సరఫరా చేసేది. ఈ ఏడాది జనవరి నుంచి ఏడాది పాటు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను కూడా జారీ చేసింది. దీంతో జనవరి నెలలో రేషన్ కార్డుదారులకు ఉచితంగా ఎండీఎం వాహనల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఎండీఎం వాహనాల ద్వారా అందించే సరుకుల్లో బియ్యాన్ని పూర్తిగా ఉచితంగా సరఫరా చేయగా, పంచదార, కందిపప్పులకు మాత్రమే డబ్బులను వసూలు చేస్తున్నారు. కేజీ కందిపప్పుకు రూ.67లు, అరకిలో పంచదారకు రూ.17లు తీసుకోవాలని, బియ్యం మాత్రం ఉచితంగానే అందించాలనే ఆదేశించింది. అంత్యోదయ కార్డుదారులకు కేజీ పంచదార రూ.13.50లకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్త ఏడాదిలో కానుక

కొత్త ఏడాది సందర్భంగా అందించే ఈ బియ్యం జిల్లా వ్యాప్తంగా ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేయడంతో లబ్ధిదారులకు నూతన సంవత్సర కానుకగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా 196 ఎండీఎం వాహనాలు ద్వారా 2,75,517 రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకే బియ్యాన్ని తీసుకువెళ్లి ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

లబ్ధిదారుల్లో ఆనందం

ప్రభుత్వం ఇంటింటికి వాహనాల ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేయడంతో పాటు కొత్త ఏడాది బియ్యాన్ని ఉచితంగా అందించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వమే ఉచితంగా బియ్యాన్ని అందించడంతో లబ్ధిదారులు సర్వత్రా హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇంటికి తీసుకువచ్చి అందించే బియ్యాన్ని సైతం ఉచితంగా ఇవ్వడం పట్ల కార్డుదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా బియ్యం పంపిణీ



ప్రభుత్వ నిర్ణయంతో కార్డుదారులకు ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. కందిపప్పు, పంచదార ఇతర సరుకులకు లబ్ధిదారులు నగదు చెల్లించాలి. కొత్త ఏడాది సందర్భంగా ప్రభుత్వం కార్డుదారులకు ఉచిత కానుకగా బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రేషన్ దుకాణాల నుంచి ఎండీఎం వాహనాల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి రేషన్ సరుకులను అందిస్తున్నాం. ప్రభుత్వం ఉచితంగా బియ్యాన్ని అందించాలనే ఆదేశాలను జారీ చేయడంతో కార్డుదారులకు ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నాం. కొత్త ఏడాది ఉచితంగా బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆ మేరకు ఎండీఎం వాహనాల ద్వారా బియ్యాన్ని అందిస్తున్నాం.

– కేవీఎల్ఎన్.మూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద క్యూలో అభ్యర్థులు



ప్రశాంతంగా ముగిసిన కానిస్టేబుల్స్ ఉద్యోగాల రాత పరీక్ష



సీతానగరంలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

- 4822 మందికిగాను 4586 మంది హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో 17, సీతానగరం మండల కేంద్రంలో 2 పరీక్ష కేంద్రాలలో పోలీస్ కానిస్టేబుల్ ఎంపికకు రాత పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పటిష్ట పోలీసు భద్రత మధ్య కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్ గట్టి చర్యలు తీసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 4822 మంది అభ్యర్థులకు గాను 236 మంది గైర్హాజరు కాగా 4586 మంది హాజరయ్యారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, డీఎస్పీలు ఎ.సుభాష్, బి.నాగేశ్వరరావు, హరితచంద్ర, జీవీ కృష్ణారావు, ఎస్బీ సీఐ శ్రీనివాసరావు కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు.

300 మంది సిబ్బందితో బందోబస్తు

జిల్లా స్థాయి అధికారులతో పాటూ ఏడుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలు, మూడు వందల మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఈ పరీక్ష కోసం ఏపీఎస్ఆర్టీసీ బస్సులు సమయానికి చేరుకునేలా ఏర్పాట్లను చేశారు. పార్వతీపురం రీజనల్ సెంటర్ పరిధిలో పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలిలో 32 కేంద్రాలలో జరిగిన పరీక్షలకు 9050 మంది అభ్యర్థులకు గాను 455 మంది గైర్హాజరు కాగా 8595 మంది పరీక్షలు రాసారని రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య సిరులు



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

చిరుధాన్యాలు ఎంతో ఆరోగ్యదాయకమని, వీటిని ప్రతీ ఒక్కరూ వినియోగించాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి మిల్లెట్ మహోత్సవం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి.ప్రవీణ్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ శ్రీహరిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన, విక్రయాలను 25 స్టాల్స్ ద్వారా ప్రారంభించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ చిరుధాన్యాలను సిరి ధాన్యాలుగా పేర్కొన్నారు. గతంతో పోలిస్తే మన ఆహార అలవాట్లలో మార్పు రావడం వల్ల, చిరుధాన్యాల వాడకం క్రమంగా తగ్గిపోయిందని అన్నారు. దీనివల్ల మధుమేహం, రక్తపోటు లాంటి వ్యాధులు పెరిగిపోయాయని చెప్పారు. గతంలో మాదిరిగా చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయానికి, రైతుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని పెంచడానికి ఇదే తగిన సమయమని అన్నారు. చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని కోలగట్ల అభినందించారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాల్సి ఉందని స్పష్టం చేశారు. ఒకప్పుడు బియ్యం కొరత ఎక్కువగా ఉండేదని, అప్పట్లో చిరుధాన్యాలను ఆహారంగా తీసుకొని, ప్రజలు ధృడంగా ఉండేవారని అన్నారు. కోవిడ్ తరువాత ప్రజల దృక్పథంలో మార్పు వచ్చిందని, చిరుధాన్యాల వినియోగం కూడా పెరిగిందని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును, మార్కెటింగ్ ప్రోత్సహించడానికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లాలో వరి తరువాత అధికంగా సాగయ్యే మొక్కజొన్న పంట కోసం మెరకముడిదాంలో మొక్కజొన్న ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు కానుందని చెప్పారు.

కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించే మన పాత సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను మళ్లీ ఇప్పుడు మొదలు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాలను పెంచాలి, తినాలి, పంచాలని పిలుపునిచ్చారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా చిరుధాన్యాలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందిస్తోందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా రాగి అంబలిని పంపిణీ చేయాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. చిరుధాన్యాలకు కూడా మద్దతు ధరను ప్రకటించిన ఏకైక రాష్ట్రం మనదేనని చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఐక్యరాజ్య సమితికి చేసిన విజ్ఞప్తి మేరకు 72 దేశాల అంగీకారంతో ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందని చెప్పారు. ఇటీవల చిరుధాన్యాల ఆహార పదార్థాలతో పార్లమెంటులో విందు భోజనాన్ని కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ మన పెద్దల ఆరోగ్యానికి చిరుధాన్యాలే కారణమని పేర్కొన్నారు. దీని కోసం ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలని స్పష్టం చేశారు.

మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి.ప్రవీణ్ మాట్లాడుతూ ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటికి ప్రాచుర్యం కల్పించేందుకు 20 రాష్ట్రాల్లో మిల్లెట్ మహోత్సవాలను నిర్వహించనున్నామని చెప్పారు. మొదటి ఉత్సవం మధ్యప్రదేశ్‌లో జరిగిందని, దేశంలో రెండో ఉత్సవాన్ని రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఇప్పుడు విజయనగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు, ప్రచార కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాయని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ రిలేషన్ ఆఫీసర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీస్ ద్వారా చిరుధాన్యాల ఉత్పత్తులను దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేయనున్నామని వెల్లడించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కూడా జరగబోతోందని చెప్పారు.

కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్.వెంకటలక్ష్మి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం స్థాపకులు కుమారస్వామి, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి త్రినాధస్వామి, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఏడీ జగన్నాధరావు, సీనియర్ సైంటిస్ట్ అనురాధ, ఏపీసీఎంఎస్ జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు, ఆకాంక్ష తదితరులతో పాటు డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరాతో మహిళాభ్యున్నతి

- మూడో విడత పంపిణీకి సిద్ధం
- జిల్లాలో ఇప్పటికే రూ.157.84కోట్ల అందజేత
- జిల్లాలో ఇప్పటివరకు 1,59,509 మందికి లబ్ధి
- రుణ మాఫీకి అర్హత పొందిన సంఘాలు 15,383
- మూడో విడతలో మహిళలకు రూ.79.65 కోట్ల మేర ప్రయోజనం

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నారు. టీడీపీ హయాంలో బ్యాంకుల్లో రుణగ్రస్తులుగా, డీఫాల్టర్లుగా మారిన వీరికి జగనన్న అన్ని విధాల అండగా ఉంటూ ఆర్థిక భరోసా కల్పించి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయిస్తున్నారు. దీంతో వీరి జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయి.



పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో వేలిముద్రల సేకరణ

పార్వతీపురం టౌన్: తాము అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తామని 2014 ఎన్నికల వేళ హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం చేపట్టాక నయా పైసా రుణం మాఫీ చేయలేదు. దీంతో పొదుపు సంఘాలన్నీ నిర్వీర్యమయ్యాయి. బ్యాంకర్ల ఒత్తిళ్లకు మహిళలు తట్టుకోలేక.. పెద్ద మొత్తాలను ఒక్కసారిగా చెల్లించలేక డీఫాల్టర్లుగా మారి తలదించుకోవాల్సిన దుస్థితి ఎదుర్కొన్నారు. మరికొందరు ఉన్న బంగారు నగలు తాకట్టు పెట్టి మరీ రుణాలు చెల్లించారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకాన్ని అందించి అండగా నిలిచింది. ఇప్పటికే రెండు విడతలుగా ఆసరా డబ్బులు చెల్లించి మూడో విడత అందించేందుకు రంగం సిద్ధం చేసింది. మూడో విడతలో వైఎస్సార్ ఆసరా కింద జిల్లాలో 15,383 స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు దాదాపు రూ.79.65 కోట్ల లబ్ధి చేకూర్చనుంది. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండు విడతల్లో రూ.157.84 కోట్లను ఆసరా పథకం కింద మహిళల ఖాతాలకు జమ చేశారు. తాజాగా మూడో విడత లబ్ధి అందజేతకు లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించి అభ్యంతరాల స్వీకరణకు అర్హుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించారు.

పాదయాత్రలో హామీ మేరకు..

ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకులకు ఏ మేరకు చెల్లించాల్సి ఉందో ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో మహిళలకు అందిస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా రూ.157.84 కోట్లు చెల్లించారు.

1.59 లక్షల మందికి మేలు

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో తొలి విడతలో 14,271 సంఘాలకు సుమారు రూ.78.18 కోట్లు, రెండో విడతలో 14,383 సంఘాలకు రూ.79.65 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడో విడతగా 15,383 సంఘాల్లో 1,65,089 మందికి లబ్ధి చేకూర్చనున్నారు.

ప్రశాంత జీవనం

నేను సాయి గణేష్ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. మా సంఘానికి రూ 3,20,180 లక్షల రుణం ఉంది. ఇప్పటికే రెండు విడతల్లో రూ.1,60,090 లక్షలను మా ఖాతాల్లోకి జగనన్న ప్రభుత్వం జమ చేసింది. నా వంతుగా రూ.22,868 వేలు నాకు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. మూడో విడత మొత్తాన్ని జమ చేసేందుకు అధికారులు వేలి ముద్రలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో చిన్న కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకుని ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నాం.

– సంగిరెడ్డి రత్న కుమారి, గోపాలపురం, పార్వతీపురం


ప్రక్రియ పూర్తి చేశాం



వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల వేలిముద్రలను జిల్లా వ్యాప్తంగా సేకరించాం. దాదాపుగా ప్రక్రియ పూర్తి కావచ్చింది. శతశాతం పూర్తి చేసేలా కార్యాచరణ వేగవంతం చేశాం. అర్హులందరికీ పథకం అందేలా చర్యలు చేపట్టాం. మహిళలకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడుతుంది.

– భారతి, ఇన్‌చార్జి డీపీఎం, పార్వతీపురం మన్యం

రూ. 79.65 కోట్లు జమ చేస్తాం



జిల్లాలో ఇప్పటి వరకు రూ. 157.84 కోట్ల రుణ మాఫీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ప్రస్తుతం మూడో విడత రూ 79.65 కోట్లను జనవరిలో జమ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తాం. మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

క్లుప్తంగా

భారీగా మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని వివిధ మద్యం షాపుల్లో కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించేందుకు తరలిస్తున్న రూ.85,200ల విలువైన 552 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి స్థానిక ఐటీఐ కాలనీ వద్ద నిర్వహించిన తనిఖీల్లో మెట్టవలస గ్రామానికి చెందిన పువ్వల పైడిరాజు, కెల్ల రాములు ఆటోలో మద్యం బాటిల్స్ అక్రమంగా తీసుకువెళ్తూ పట్టుబడినట్లు ఎస్సై వి.జ్ఞానప్రసాద్ తెలిపారు. మద్యం బాటిల్స్‌తో పాటు తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కారు దగ్ధం



కోనేటి గట్టుపై దగ్ధమవుతున్న కారు

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధి వడమ ప్రాంతంలో కల్యాణి కోనేటి గట్టుపై కొద్ది రోజులుగా పార్కింగ్‌లో ఉన్న కారు దగ్ధమైంది. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి కారు నుంచి మంటలు, దట్టమైన పొగ వ్యాప్తి చెందడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ కారు ఎవరిదనే విషయం తెలియరాలేదు. ఘటనలో కారు పూర్తిగా కాలిపోయింది.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని రాజ్‌మహల్ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు మరడాన మురళీకృష్ణ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. విశాఖలో చదువుకుంటున్న కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు కుటుంబసభ్యులు వెళ్లగా ఈ చోరీ జరిగినట్లు తెలిసిందని బాధితుడు విలేకరులకు తెలిపాడు. రెండున్నర కిలోల వెండి, నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్షా 40వేల నగదు పోయినట్లు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి పరిశీలించారు.

నాటుబండిని ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ దుర్మరణం



సూరిబాబు మృతదేహం

పూసపాటిరేగ: స్థానిక జాతీయరహదారి సర్వీసురోడ్డులో ఓ మోటార్ సైకిల్ నాటుబండిని వెనుక నుంచి ఢీకొని వాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పేరాపురం గ్రామానికి చెందిన శీలవలస సూరిబాబు(25) హెచ్‌బీఎల్ పరిశ్రమలో ఎస్ఎంఆర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం ఉదయం 5 గంటల సమయంలో పేరాపురం నుంచి పూసపాటిరేగ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మంచుకారణంగా ముందు ఉన్న నాటు బండి కనిపించకపోవడంతో మోటార్‌సైకిల్‌తో బలంగా ఢీకొనడంతో ఛాతీకి తీవ్రగాయమై మృతి చెందాడు. మృతుడికి తల్లి లక్ష్మి ఉంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ హరిఅప్పారావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ముఖ్యమంత్రి బీసీల పక్షపాతి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- బీసీ కార్పొరేషన్‌ల పదవీకాలం పొడిగింపుపై డైరెక్టర్ల హర్షం



డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు దుశ్శాలువ కప్పి కృతజ్ఞతలు చెబుతున్న బీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు

విజయనగరం: బీసీ కార్పొరేషన్‌ల పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయా బీసీ కార్పొరేషన్‌ల విజయనగరం నియోజకవర్గం డైరెక్టర్లు ఆదివారం శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ప్రజారంజక పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని, తన పాదయాత్రలో బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తానని ఇచ్చిన హామీకి అనుగుణంగా అధికారం చేపట్టిన తర్వాత బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. సంక్షేమంలో 50% బీసీలకు అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ఆయా బీసీ కార్పొరేషన్‌ల ద్వారా బీసీ వర్గాలకు మరింత మెరుగైన సేవలు అందించాలని డైరెక్టర్లకు సూచించారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

ఈ సందర్భంగా ఆయా బీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. తమను అన్ని విధాలా ప్రోత్సహించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్లను కలిసిన వారిలో రాష్ట్ర నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్ ఆవనాపు లక్ష్మణరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్ బోగి కుసుమ కుమారి, శ్రీవైష్ణవ కార్పొరేషన్ డైరెక్టర్ దాస్యం వామనాచారి, శ్రీరామమూర్తి, నాగవంశ సంఘ ప్రతినిధులు కాళ్ల సూరిబాబు, కాళ్ల సత్యనారాయణ, భేరి సత్యనారాయణ, అవనాపు రాజు, కాళ్ల సునీల్, మొకర సతీష్, కాళ్ల ఆనంద్, కాళ్ల సుధాకర్ తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణం సమీపంలో సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి ఎడమ చేతిపైన రాజ్ అని, కుడిచేతి వైపు శివుని త్రిశూలం సింబల్ పచ్చబొట్టు ఉందని, నీలం రంగు ట్రాక్, సర్ఫ్ కలర్ రౌండ్ నెక్ టీషర్ట్ ధరించి ఉన్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఫోన్ 9666555214, 9490617089 నంబర్లను సంప్రదించాలని కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చికిత్సపొందుతూ బాలిక..

బాడంగి: తల్లిదండ్రులు తరచూ గొడవలు పడి తల్లి ఇల్లు విడిచి కన్నవారింటికి తన తమ్ముడితో కలిసి వెళ్లిపోవడాన్ని తట్టుకోలేక చీమలమందుతాగేసిన బాలిక విజయనగరం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జీకేఆర్‌పురం గ్రామానికిచెందిన ముద్దాడ స్రవంతి(15) బాడంగి కస్తూరిబా బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సంక్రాంతిసెలవులకోసం ఇంటికివెళ్లింది. తండ్రి లక్ష్మణరావు మద్యానికి బానిసై తాగుతుండగా తల్లి పార్వతి పండగరోజుల్లోనైనా పిల్లలతో సరదగా ఉండమని, తాగొద్దని హితవు పలికింది. కానీ లక్ష్మణ రావు ఎప్పటిలాగానే తాగివచ్చి గొడవకు దిగడంతో భార్య, కుమారుడ్ని తీసుకుని ఈ నెల 18న సీతానగరం మండలం సూరంపేట వెళ్లిపోయింది. దీంతో స్రవంతి మనస్తాపానికి గురై చీమలమందు తాగేసింది. మృతురాలి తల్లి పార్వతి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఉమామహేశ్వరరావు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.



మృతిచెందిన బాలిక స్రవంతి

రైలు కింద పడి మహిళ..

చీపురుపల్లి: చీపురుపల్లి రైల్వే స్టేషన్ వద్ద 30 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని మహిళ గూడ్సు రైలు కింద పడి మరణించినట్లు జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనువాసరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఫోన్ 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



రైలు కింద పడి మరణించిన మహిళ

చికిత్స పొందుతూ వ్యక్తి..

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన అల్లు రామారావు (28) చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందాడని ఏఎస్సై భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఏఎస్సై తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రామారావు విశాఖపట్నంలో నివాసముంటూ తాపీమేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సంక్రాంతి పండగకు కుటుంబ సభ్యులతో స్వగ్రామం వచ్చాడు. రెండు రోజుల క్రితం ఒంట్లో నలతగా ఉండడంతో తల్లి పోలమ్మ ఇంటిమేడపై నిద్రకు ఉపక్రమించాడు. మరునాడు ఉదయం 9గంటల సమయంలో భార్య భాను టిఫిన్‌కోసం పిలిచేందుకు మేడపైకి వెళ్లగా అప్పటికే బాత్‌రూమ్‌లో పడిపోయి తలకు గాయాలతో కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ 21న రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

పోలిపల్లి పైడితల్లికి ప్రత్యేక పూజలు చేసిన జీఎంఆర్

రాజాం సిటీ: ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు(జీఎంఆర్) కుటుంబ సమేతంగా ఆదివారం స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుడు సూర్యనారాయణశర్మ ఈ సందర్భంగా వారితో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను ఈఓ బీవీ మాధవరావును జీఎంఆర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల 26 నుంచి మూడు రోజుల పాటు అమ్మవారి వార్షిక జాతర నిర్వహించనున్నామని ఈఓ ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు. అలాగే పోలిపల్లి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి ఆర్చ్ నిర్మాణం చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులు జీఎంఆర్‌ను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన అంచనాలు తయారుచేయాలని సూచించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో జీఎంఆర్ పీఏ ఆర్.అన్నంనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు వాకచర్ల రాజా, సలాది తులసీదాస్, సలాది మహేశ్వరరావు, వి.లక్ష్మణరావు, పెంకి చైతన్య తదితరులు ఉన్నారు.



ఆలయ అభివృద్ధి పనులపై జీఎంఆర్‌కు వివరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

- అలుగోలు చేరుకున్న కబడ్డీ క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 13 మంది బాలురు, 13 మంది బాలికల జట్లు ఆదివారం క్రీడా మైదానానికి చేరుకున్నాయి. వారికి నిర్వాహకులు వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు కబడ్డీ అసోషియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.



కబడ్డీ క్రీడాకారులకు సూచనలు అందిస్తున్న కోచ్ పతివాడ శ్రీనివాసరావు

అల్లూరి జిల్లాలో పులి బోను ఏర్పాటు

- పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్

బొండపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పులి సంచారం ఎక్కువగా ఉన్నందున పులి ట్రాప్ కేజ్ (పులిబోను)ను ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని వన మిత్ర కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం అయన అటవీశాఖ అధికారులతో పాటు హైదరాబాద్ జూపార్క్ రిటైర్డ్ వెటర్నరీ జాయింట్ డైరెక్టర్‌తో పాటు విశాఖపట్నం నెహ్రూ జూపార్క్ వెటర్నరీ వైద్యాధికారితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వనమిత్ర కేంద్రంలో ఉన్న పులి బోనును పరిశీలించారు. జిల్లాలో ఉన్న బోను మాదిరిగానే త్వరలో తయారు చేసి పులిని సురక్షితంగా పట్టుకోవడానికి చర్యలు తీసుకోవాలనే క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు తెలిపారు. బొండపల్లి మండలంలోని వెదురువాడ, పాతపనసలు పాడు ప్రాంతాల్లో పులి దాడి చేసి ఆవులను చంపిన ప్రాంతాలు పరిశీలించినట్లు తెలిపారు. అయా గ్రామాలకు కొద్ది కిలోమీటర్ల దూరంలోనే అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అనంతగిరి మండలానికి చెందిన గిరిజన గ్రామాలు ఉన్నాయని చెప్పారు. పులి ఈ రెండు మండలాలకు చెందిన గిరిజన ప్రాంతాల్లోనే ఎక్కువగా సంచరిస్తున్నట్లు గుర్తించామని వివరించారు.



పులిట్రాప్ కేజ్ (బోను)ను పరిశీలిస్తున్న పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్ తదితరులు

చెట్టును మినీ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

- మరో 8 మందికి గాయాలు



అల్లుబోయిన మల్లేశు మృతదేహం

వీరఘట్టం: ఒడిశా రాష్ట్రం రాయగడలోని మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు వ్యాన్‌లో వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం వీరఘట్టం మండలం తూడి జంక్షన్ సమీపంలో ఓ చెట్టును వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మరణించగా మరో 8 మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం యరకయ్యపేటకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు 15 మంది శనివారం రాత్రి రాయగడ మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు మినీ వ్యాన్‌లో పయనమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు వ్యాన్‌లో బయలుదేరి తిరిగి వస్తుండగా తూడి జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న అల్లుబోయిన మల్లేశు(40) రోడ్డుపై పడడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. అలాగే మరో 8 మందికి గాయాలు కావడంతో అందరినీ పాలకొండ ఏరియా ఆస్పత్రికి వైద్య కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశు తుదిశ్వాస విడిచాడు. మిగిలిన వారిని మెరుగైన వైద్య చికిత్సల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు.

కొండచిలువ హతం

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామ పంట కాలువ వద్ద సంచరిస్తూ కనిపించిన ఏడు అడుగుల పొడవైన కొండచిలువను స్థానికులు భయాందోళనతో హతమార్చారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే వారికి ఎటువంటి అపాయం లేకుండా ఉండేందుకే సర్పాన్ని చంపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.



హతమార్చిన కొండ చిలువను చూపిస్తున్న గ్రామస్తుడు

అయ్యన్నపాత్రుడికి మతి భ్రమించింది

- రాష్ట్ర వెలమకార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు

కొత్తవలస: రాష్ట్ర మాజీమంత్రి, టీడీపీ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడికి మతి భ్రమించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కారుకూతలు కూస్తున్నారని మరో మారు ఇలాంటి అవాకులు చవాకులు పేలితే క్షేమించేది లేదని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆదివారం విలేకరల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక సంక్షేమ పాలనకు అన్ని వర్గాల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోందని అది చూసి ఓర్వలేని కొందరు టీడీపీ నాయకులు మతి భ్రమించి పిచ్చికూతలు కూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎవరైనా సైకో ఉన్నారంటే అది నారా చంద్రబాబునాయుడేనని అన్నారు. ఆయన సైకో లక్షణాలను తెలుగుదేశం పార్టీ నాయకులు పుణికిపుచ్చుకుని మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అయ్యన్న గతంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసి ఇలాంటి కారుకూతలు కూయడం సభ్యసమాజానికి సిగ్గుచేటన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి మెరపుల సత్యనాయణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బొంతల వెంకటరావు, సర్పంచ్‌లు ఈశ్వరరావు, బూశాల దేముడు, పీతల కృష్ణ, ఎంపీటీసీ వెలగల రమణ, పార్టీ నాయకులు పెదిరెడ్ల సూరిబాబు, పీఎస్ఎన్.పాత్రుడు, ఎస్.గణేష్, మదీనా అప్పలరమణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

తెర్లాం: మండలంలోని వెలగవలస సమీప మామిడి తోటలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి సంబంధించి స్థానిక పోలీసులు నమోదు చేసిన హత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నెల 16న వెలగవలసలోని మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. ఎస్పీ ఎం.దీపికాపాటిల్ ఆదేశాల మేరకు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు దర్యాప్తు ప్రారంభించారు.

రసవత్తరంగా సంగిడీల పోటీలు



సంగిడీల పోటీలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న సత్యనారాయణ



సంగిడీల పోటీల్లో తృతీయ స్థానం దక్కించుకున్న త్రినాథ



సంగిడీల పోటీదారు వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సంతకవిటి: బాలఅన్నమ్మ పేరంటాలు జాతర పురస్కరించుకుని, మండలంలోని సురవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన సంగిడీల పోటీలు రసవత్తరంగా సాగాయి. సర్పంచ్ గంటా షణ్ముఖరావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 12 మంది పాల్గొన్నారు. 130 కిలోల సంగిడీలు ఎత్తేవరకూ పోటీదారులు పోటాపోటీగా తలపడ్డారు. ఒప్పంగికి చెందిన గేదెల సత్యనారాయణ, తమ్మినాయుడుపేటకు చెందిన ముద్దా వెంకటేష్, చింతవానిపేటకు చెందిన ఆవాల వెంకటేష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు కై వసం చేసుకున్నారు. తాలాడకు చెందిన వంకల ఆది ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. వీరికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జరిగిన 140 కిలోల ఉలవల బస్తా పోటీల్లో చింతవానిపేట చెందిన ఆవాల వసంత్ విజేతగా నిలవగా, అతడికి రూ.3 వేల నగదు బహుమతి అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెదనడిపల్లి విద్యార్థులు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన ఎ.అబిలాష్, జె.రవికిరణ్, యు.పవన్‌కుమార్, బాలికల విభాగంలో ఎం.పావని,బి.కృపాజ్యోతి, ఎం.బార్గవి, జి.లిఖిత, ఎం.హరిణిలు ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కె.రహనా బేగం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు

- స్కూల్‌గేమ్స్ పోటీల్లో 28 పతకాలు సాధించిన విద్యార్థులు



రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: ఈనెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14,17 విభాగాల్లో బాల, బాలికలకు జరిగిన పోటీల్లో 28 పతకాలు సాధించిన విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 5 బంగారు పతకాలు, 15 వెండి పతకాలు, 8 కాంస్య పతకాలను జిల్లా విద్యార్థులు సాధించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ జిల్లా విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

అండర్-19 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



అండర్-19 కరాటే పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



రోప్ స్కిప్పింగ్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో మూడు క్రీడాంశాల్లో ఆదివారం నిర్వహించారు. రోప్ స్కిప్పింగ్, ఫుట్‌బాల్, కరాటే క్రీడాంశాల్లో జరిగిన ఎంపిక పోటీలకు ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారిలో రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ తెలిపారు. అలాగే ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు తిరుపతి జిల్లా కేంద్రంలో గల ఎస్వీఆర్ట్స్ కళాశాలలో జరిగే పోటీలకు..కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29న ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో జరిగే పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలను వ్యాయామ అధ్యాపకులు కె.తౌడుబాబు తదితరులు పర్యవేక్షించారు.